మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

# రెవెన్యూలో అవినీతి

## • విఆర్‌ఓ నుంచి తహశీల్దార్ వరకు..

## • ప్రతి పనికీ ఓ రేటు

## • తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

**రెవిన్యూ శాఖలో అవినీతికి అడ్డుకట్ట పడడం లేదు. భూములు ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవాలన్నా, పట్టా పాస్‌పుస్తకం పొందాలన్నా ఇలా ఏ పని చేయించుకోవాలన్నా రెవెన్యూ శాఖలో డబ్బులు చెల్లిస్తే తప్ప పనులు కాని పరిస్థితి ఉంది. తహశీల్దార్ నుండి గ్రామస్థాయిలో ఉన్న విఆర్‌ఓ వరకు పైసలిస్తేనే పని లేదంటే లేదన్న రీతిగా నడుస్తోంది...**

జిల్లాలో రెవెన్యూ శాఖ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఈ శాఖ ద్వారా పొందే సేవల కోసం ప్రజలు ఎంతో కొంత ముడుపులు చెల్లించుకుంటే తప్ప పనులు కానటువంటి పరిస్థితి నెలకొంది. మండలంలోని రెవెన్యూ శాఖ కార్యాలయం చుట్టూ సామాన్య ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మొరపెట్టుకుంటున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. కర్నూలు కలెక్టరేట్లో జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయి. కల్లూరు, కర్నూలు రూరల్, ఓర్వకల్, వెల్దుర్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు, గోనెగండ్ల, ఆలూరు తదితర మండలాల్లో రెవెన్యూ శాఖ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. విఆర్‌ఓల నుంచి తహశీల్దార్ల వరకు జరుగుతున్న అవినీతిలో అధికార పార్టీ నేతలు వాటాలు పంచుకుంటున్నారు.

జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలకు అవినీతి అక్రమాలకు సంబంధించిన వాటాలను రెవెన్యూ అధికారులే వెళ్లి ముట్టచెబుతున్నారు. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో రైతు తలారి వసంత 40 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విన్నవించుకున్నారు. అక్కడ ఉన్న విఆర్‌ఓ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అనర్హులకు భూములను ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. అందుకోసం పెద్ద ఎత్తున ముడుపులను కూడా తీసుకుంటున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. కల్లూరు మండలం చెట్ల మల్లాపురం గ్రామంలో రైతు శివప్రసాద్‌కి చెందిన భూమిని ఆన్‌లైన్ చేయడం కోసం రూ.లక్షల డిమాండ్ చేయడంతో కొంత మొత్తంలో రెవెన్యూ అధికారులకు ముడుపులు సమర్పించినా పూర్తి స్థాయిలో పని కాలేదు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో రైతు ఉగాది గిడ్డయ్య తన 70 సెంట్ల భూమిని సర్వే చేయించడం కోసం నాలుగు నెలలుగా గ్రామ సర్వేయర్ చుట్టు తిరుగుతున్నా సర్వే రిపోర్ట్ ఇవ్వడం లేదు. దానికి కారణం సెంటుకు 500 చొప్పున రూ.35 వేలు ఇవ్వాలని అక్కడి రెవెన్యూ అధికారులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు

**- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.**

రెవెన్యూ శాఖలో సామాన్య రైతులు పనులు చేయించుకోవాలంటే అంత సులువు కావడం లేదు. రెవెన్యూ అధికారులకు ముడుపులు ముట్టచెబితే తప్ప ఫైళ్ళు కదలని పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో జిల్లాలో నెలకొన్న రెవిన్యూ శాఖలో అవినీతిపై విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. అవినీతికి పాల్పడే అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విన్నవించాం. ఈ శాఖ ద్వారా అందే సేవలు ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా అందేలా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

### అవినీతికి పాల్పడే వారిపై చర్యలు

**- వెంకటనారాయణమ్మ, జిల్లా రెవెన్యూ అధికారి**

రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఉద్యోగులు సిబ్బంది కృషి చేయాలి. ఎవరైనా అవినీతికి పాల్పడితే అటువంటి వారిపై విచారణ చేసి సస్పెండ్ చేస్తాం. అటువంటి వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

# చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

## • జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరగాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు..బుధవారం మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో చేపడుతున్న పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 1200 మంది శానిటరీ వర్కర్లు ఉన్నప్పటికీ నగరాన్ని శుభ్రంగా ఉంచకపోతే ఎలా అని కలెక్టర్ పేర్కొన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోతే శానిటరీ ఇన్స్పెక్టర్ల మీద కఠిన చర్యలు తప్పవన్నారు.. బి క్యాంప్ నుండి రాజవిహార్ వరకు ఉన్న రోడ్ శుభ్రంగా లేదని పలు మార్లు చెప్పినప్పటికీ మార్పు రాలేదన్నారు. సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. ప్రజారోగ్య అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. వంద శాతం పారిశుధ్య కార్యక్రమాలు జరగాలని, పుష్ కార్ట్ లు అదనంగా అవసరం ఏమైనా ఉంటే జనరల్ ఫండ్స్ లో తీసుకోవాలన్నారు.కల్లూరులో ఉన్న 16 వార్డులకు ప్రతి రోజు నీరు ఇచ్చేందుకు కమిటీ వేశామన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, కర్నూలు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పార్థసారథి, కృష్ణమ్మను అరెస్టు చేయాలి

## • కలెక్టరేట్ ముందు దళిత సంఘాల ఆందోళన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆదోని మండలం డాణాపురం దళిత సర్పంచి పట్ల అంటరానితనాన్ని పాటించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని, టిడిపి నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ దళిత, గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆదోని దళిత గిరిజన ప్రజాసంఘాల జెఎసి నాయకులు దేవదాసు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, డానాపురం సర్పంచి చంద్రశేఖర్, గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు రాగుల రాముడు, డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, న్యాయవాది కిరణ్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు మాట్లాడారు. జూన్ 16న డానాపురం గ్రామంలో ప్రజల వద్దకు పార్థసారథి పేరుతో గుడి కట్ట వద్ద నిర్వహించిన సభ ద్వారా ఏకంగా దళిత సర్పంచి పట్లనే బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అంటరానితనాన్ని పాటించి రాష్ట్ర పరువును మంటగలిపారన్నారు. ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. సామాన్య దళితులపై దాడులు దౌర్జన్యాలు హత్యలు అత్యాచారాలు చేయడమే కాదు.. దళిత ప్రజా ప్రతినిధులైనా సరే వారి పట్ల అంటరానితనాన్ని పాటిస్తాం.. అన్న సంకేతాన్ని ఈ ఘటన సమాజం ముందు ఉంచుతోందన్నారు. ఒకవైపు స్పష్టంగా వీడియో రికార్డింగ్ కళ్ళ ముందు కనపడుతున్నా మరోవైపు తనపట్ల కుల వివక్షను పాటించి, దారుణంగా అవమానించారని సర్పంచి చెబుతున్నా.. కేసు కూడా నమోదు చేయడం లేదంటేనే, పోలీసులు కూడా దళితుల పట్ల వివక్షను పాటించడమేనన్నారు. చట్టంపైన ఉన్న గౌరవంతోనే ఇప్పటిదాకా వివిధ రూపాలలో అధికారులను కలుస్తూ వచ్చామని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కేసు నమోదు చేయించకపోతే ఉద్యమాన్ని మరింత పెద్ద ఎత్తున తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. దళిత జెఎసి నాయకులు కెవిపిఎస్ విజయ్, ఎన్‌టిఎఫ్ సూర్య, సుజ్ఞానమ్మ, టిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్రప్ప మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, విజయమ్మ, జిల్లా నాయకులు కళావతి, లక్ష్మీనారాయణ, నగర నాయకులు బాబురావు, రామాంజనేయులు, జాన్సన్, ప్రదీప్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

# ఇసుక మళ్లీ సిద్ధం

**-పది నెలల అవసరాలకు సరిపడా 11 రీచులు గుర్తింపు**
**-1.5 లక్షల టన్నులు తోడెందుకు పర్యావరణ అనుమతులు**

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో ప్రజలకు ఇసుక అవసరాలను తీర్చేందుకు మరో మారు మైనింగ్ శాఖ, జలవనరుల శాఖ పర్యావరణ శాఖల సమన్వయంతో రంగం సిద్ధం చేసింది. ఇటీవల వర్షాలు జోరుగా కురుస్తుండడంతో గత 15 రోజులుగా ఇసుకరీచుల్లో మునకకు గురి కావడం వల్ల ఇసుక తోడే పనులు నిలిచిపోయాయి. మరికొన్ని రీచ్‌లో అనుమతులు కాలం సమీపిస్తుండడంతో అనుమతులు పొందే ప్రక్రియను మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసింది. అందులో భాగంగా జల వనరుల శాఖల సమన్వయంతో పర్యావరణ అనుమతులను పొందింది. ఈమేరకు జిల్లాలో 11 రీచులకు అనుమతులు పొందింది. అందులో ప్రధానంగారెడ్డి సమీపంలో కొత్తకోట, సింగవరం, ముడుమాల, ఈర్లదిన్నె, పల్లెదొడ్డి, నందవరం మండలంలో నాగులదిన్నె, జోహరాపురం, కౌతాళం మండలంలో మరాలి, నదిచాగి, గుడికంబాలి, గోవుల గుంద మండలంలో ముదటమాగి రీచులను గుర్తించారు. ఈ రీచుల్లో ఈనెల ఆరవ తేదీ నుంచి ఇసుక లోడింగ్ ప్రారంభించారు.

**పది నెలలకు సరిపడా ఇసుక**

జిల్లాలో ప్రజల ఇసుక అవసరాలను గుర్తించి మైనింగ్ శాఖ 11 రీచుల్లో మొత్తం 10 నెలలకు సరిపడా ఇసుకను గుర్తించారు. వీటి నుంచి మొత్తం లక్ష 50 వేల టన్నుల ఇసుక తోడే అవకాశం ఉన్నట్లు గుర్తించారు.

**ఇసుకను ప్రజలు వినియోగించుకోవాలి**

**- వి.రవిచంద్, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా గనులు , అభివృద్ధి శాఖ**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుకపాలసి విధానంలో భాగంగా జిల్లాలో 11 కొత్త ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులను తీసుకున్నాం. గత 15 రోజులుగా వర్షాల కారణంగా లోడింగ్ పనులు రీచుల్లో ఆగిపోయాయి. ఆరవ తేదీ నుంచి లోడింగ్ ప్రారంభించాం. సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

మాట్లాడుతున్న అధికారులు

# పిఎం సూర్య ఘర్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో పి. అయుబ్ ఖాన్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్, ఐపిసి, ఆర్ఎసి, ఐటి/ ఎపిఎస్‌పిడిసిఎల్ కర్నూలు జిల్లా మండల, సబ్ డివిజన్ , డివిజన్ అధికారులు, సోలార్ వెండర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూట్‌ఆఫ్ ప్రగతిని మండల/సెక్షన్ వారీగా సమీక్షించారు. ఈ అద్భుతమైన పథకాన్ని వినియోగదారులకు కల్పిస్తూ సోలార్ వెండర్లకు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తూ ప్రతి మండల అధికారి పట్టణ , అభివద్ధి చెందే ఏరియాలో ఉండే అధికారులు కనీసం 100 సోలార్ యూనిట్లను, గ్రామీణ ప్రాంత అధికారులు కనీసం 20 సోలార్ యూనిట్లను ఈ నెలాఖరు లోగా ప్రతి ఒక్కరూ అమర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా చేపట్టే పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (సానుకూల ప్రజాభిప్రాయం) సంతృప్తి శాతం పెంచడానికి అవసరమయ్యే వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడం ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా వినియోగదారులందరికీ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ వారి సంతృప్తి శాతం పెంచడానికి ప్రతి అధికారి కచ్చితంగా విధులు నిర్వహించాలని ఆదేశించినారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.కృష్ణారెడ్డి సుపరింటెండింగ్ ఇంజనీర్/ అసెస్మెంట్ , ఎంక్వయిరీ/ఏపీఎస్పీడీసీఎల్, కర్నూలు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.ఉమాపతి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.ఓబులేష్, టి.శేషాద్రి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ ఎం.మహేశ్వర్ రెడ్డి , ఆదోని, ఎమ్మిగనూరు ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ

# ప్రజలు సమస్యలతో సతమతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మండలంలోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ అన్నారు. బుధవారం సిపిఎం కర్నూలు మండల కమిటీ సమావేశం మండల నాయకులు రాఘవేంద్ర అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. సమావేశానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి .రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు మండలంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధానమైనవి ఈ తాండ్రపాడు గ్రామంలో వరదల సందర్భంగా పునరావాసం కింద 70 ఎకరాల భూమిలో 1500 మందికి పట్టాలు ఇచ్చారని, నేటికీ స్థలాలు చూపించక పోవడంలో ఔచిత్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గొందిపర్ల గ్రామంలో చిప్పరౌస్ కొట్టాలలో దాదాపు 40 సంవత్సరాల నుండి 150 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని వారికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పశుపల గ్రామం , అంబేద్కర్ నగర్, గార్గేయపురం గ్రామాలలో వందలాదిమంది పేద ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న కొట్టాలకు, ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య మాట్లాడుతూ ఉల్చాల లాంటి అనేక గ్రామాలలో తాగునీటితో సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అనేక గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదని డ్రైనేజీల సౌకర్యం లేదని కనీసం వీధి దీపాలు పోతే వేసే పరిస్థితి ఈ ప్రభుత్వంలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని లేకపోతే బాధితులను ఐక్యం చేసి దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల నాయకులు శ్రీరాములు, బాలపీరా (సర్పంచి ఈతండ్రపాడు )నరసింహ పాల్గొన్నారు.

# ట్రాలీ ఆటో బోల్తా

**-15 మందికి గాయాలు**
**-మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి**

ప్రజాశక్తి వెల్దుర్తి : టైరు పేలి ట్రాలీ ఆటో కిందపడి 15 మందికి గాయాలు అయిన ఘటన బుధవారం జాతీయ రహదారిలోనీ వెల్దుర్తి సమీపంలో జరిగింది. బేతంచర్ల మండలానికి చెందిన వారు డోన్ లోని పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఇదే సమయంలో అటుగా వెళుతున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈ ఘటనను చూసి సంఘటనా ప్రాంతానికి వెళ్లి ప్రమాదంలో గాయపడిన వారిని దగ్గరుండి అంబులెన్స్‌లో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే స్పందించిన తీరుపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# జిజిహెచ్‌లో రెండు అరుదైన ఆపరేషన్లు

**వైద్య బృందానికి అభినందనలు తెలిపిన డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్**

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో రెండు అరుదైన ఆపరేషన్స్ విజయవంతంగా నిర్వహించినట్లు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రకాష్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే14న కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్లో సర్జరీలను ప్రారంభించామని, మే నెలలో 28, జూన్‌లో 36, జులైలో 55 కేసులకు సర్జరీలను నిర్వహించినట్లు తెలిపారు. అరుదైన ఆపరేషన్స్ పై సర్జికల్ ఆంకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.చైతన్య వాణి మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన రసూల్ సాహెబ్, 57 సంవత్సరాలు క్లోమం క్యాన్సర్ ఉందని జులై 13న అడ్మిట్ చేసుకుని జులై 18న విపుల్స్ సర్జరీ చేశామన్నారు. క్లోమ గ్రంధి పిత్తాశయం పొట్టనుండి ఉండే కంటిన్యూయేషన్‌ను కట్ చేసామని, ఇది చిన్న పేగులోకి కూడా వెళుతుందని, అక్కడ కట్ చేసి పేగుల తోటే చానల్ క్రియేట్ చేశామని, దీనిని ఎలాంటిలీక్, ఎలాంటి సమస్య లేకుండా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం అతనిని డిశ్చార్జ్ చేశారు.

ఈ ఆపరేషన్‌కు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో అయితే సుమారు ఐదు నుంచి ఆరు లక్షల దాకా ఖర్చు అవుతుందని అన్నారు. మరొక పేషంటు కడప జిల్లా ఉప్పలూరుకు చెందిన ఈశ్వర్ రెడ్డి 74 సంవత్సరాలు మల విసర్జన ఇబ్బందికరంగా ఉండటంతో జులై 21న అడ్మిట్ అయ్యారని దీనిని అరుదుగా వచ్చే మలద్వారం కాన్సర్ (ఆనల్ మెలనోమా) అని గుర్తించి జులై 24న మలద్వారం దగ్గర ఉండే పెద్ద పేగును తొలగించామని ఎటిఆర్ సర్జరీ విజయవంతంగా నిర్వహించామన్నారు. ఎలాంటి సమస్య లేకపోవడంతో ఈరోజు డిశ్చార్జి చేశామని తెలిపారు. బయట ప్రయివేట్ హాస్పిటల్లో ఈ సర్జరీ చేయాలంటే సుమారు మూడు లక్షలు ఖర్చు అవుతుందని ఈ రెండు కేసులను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగానే కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో చేశామన్నారు. ఈ అరుదైన ఆపరేషన్స్‌ను సర్జికల్ అంకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.చైతన్యవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీసన్న, అనస్థీషియా విభాగం నుండి ప్రొఫెసర్ డాక్టర్ విశాల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సంధ్య డాక్టర్ జోత్స్న, డాక్టర్ కాంచన, డాక్టర్ మాలిక్ బృందం నిర్వహించిందని తెలిపారు. విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించిన బృందాన్ని క్యాన్సర్ ఇన్సిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రకాష్ అభినందించారు.

ఆపరేషన్ చేయించుకున్నా వారితో వైద్య బృందం, సిబ్బంది

## కూటమి ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణుల అభివృద్ధి

**-నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్**

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

క్యాబినెట్ సమావేశంలో మన నాయి బ్రాహ్మణులకు సంబంధించిన సెల్యూన్ షాపులకు ఉచిత విద్యుత్తును 150-200 యూనిట్లు పెంచుతూ క్యాబినెట్ ఆమోదం తెలిపారన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ మాట్లాడుతూ నాడు నాయి బ్రాహ్మణ కళాకారులకు సంబంధించి డోలు, సన్నాయి, శృతి సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం సర్కులర్ విడుదల చేయడం, దేవాదాయ శాఖలో పాలకమండలి సభ్యులుగా అవకాశం కలిపించడం నేడు నాయి బ్రాహ్మణ సెల్యూన్ షాపులకు ఉచిత విద్యుత్తును 150-200 యూనిట్లు పెంచుతూ జీవో నెంబర్15 ఆమోదం తెలుపుతూ క్యాబినెట్లో తీర్మానం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. నాయి బ్రాహ్మణ అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలు, శీను, వెంకటేష్ ,రాజేష్, రమణ, రాజన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలకవీటి విజయ కుమార్

# అదానీకి కోట్లు - జనం జేబులకు తూట్లు

**స్మార్ట్ మీటర్లు - ప్రభుత్వాల తీరుపై ర్యాలీలో ఐక్య సంఘాల డిమాండ్**

ప్రజాశక్తి-సి బెళగల్

దొంగ చాటుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తూ కార్పొరేటర్లు ఆదానికి కోట్లు దోచిపెట్టేందుకు మన జేబులకు తూట్లు పొడిచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరుపై ప్రజా ఐక్య సంఘాలు బుధవారం దండేతాయి.వ్యవసాయ కార్మిక, సంఘం, సిఐటియు, హమాలీ, రైతు సంఘం, ఆటో యూనియన్, ఎఐటియుసి లు విద్యుత్ కార్యాలయం ఎదుట ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఇందుకు సిఐటియు ప్రాంతీయ నాయకులు మోహన్ మద్దతుగా నిలిచి సెల్ ఫోన్ ఛార్జింగ్ ఎలా ఎక్కించుకొంటే అలా మనకు విద్యుత్ సరఫరా అయ్యే విధానమే ఈ స్మార్ట్ మీటర్ విధానమని, దీంతో సామాన్యులకు పాట్లు తప్పవన్నారు. జేబులకు చిల్లులు పెట్టె ఈ విధానం తిప్పికొట్టాలని , వ గ ల గొ ట్టా ల ని ప్రజలకు సూచించారు. అనంతరం లైన్ మెన్లు ఆలం బాషా, శ్రీనివాసులుకు వినతిని అందజేశారు.ఈ కార్యక్రంలో హమాలీ కార్మికులు సుందర్‌రాజు, రంగన్న, భాస్కర్, అక్బర్, ఖాజా, యంకప్ప, బాలు, పెద్ద హుస్సేన్, గోపాల్, ఎఐటియుసి మండల అధ్యక్షులు మల్లికార్జున, కార్యకర్తలు సంటెన్న, జైలు, నాగన్న, రవి, మాబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో వినతులు ఇస్తున్న నాయకులు

# టమోటా రైతుల ఆనందం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లోని టమోటా ధరలు రోజురోజుకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మే ,జూన్ మాసాలలో టమోటా సాగుచేసిన రైతులకు టమోటా పంటను కోత కోసి మార్కెట్ కు తీసుకొస్తున్నారు. బుధవారం 114 క్వింటాళ్ల టమోట రైతులు మార్కెట్ తెచ్చారు. 100 కిలోల టమోటా గరిష్ట ధర రూ.4300, మధ్యధర రూ.3100, కనిష్ట ధర రూ.2400 పలికినట్లు మార్కెట్ యార్డ్ సెక్రటరీ కార్నలిస్ తెలిపారు.

మాట్లాడుతున్న టి.రాముడు

# ఇంటి పట్టాల కోసం రాస్తారోకో

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

యాబై ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నా బాలగంగాధర్ తిలక్ నగర్ గుడిస వాసులకు జీవో నెంబర్ 30 ప్రకారం ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆర్‌టిసి బస్టాండ్ రోడ్డు లోగల బాలగంగాధర్ తిలక్ నగర్ ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో వార్డు కార్యదర్శి సి. చలపతి అధ్యక్షతన రాస్తారోకో చేశారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 42వ వార్డు బాలగంగాధర్ తిలక్ నగర్‌లో బడుగు బలహీన వర్గాల ప్రజలు రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. 50 యేళ్లుగా గుడిసెలు వేసుకుని ఉన్నారన్నారు. కార్పొరేషన్ అధికారులు స్లం ఏరియాగా గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారని వారి ఇళ్లకు ఇంటి పన్నులు, కరెంటు మీటర్లు రావడంతో కొంతమంది పక్కా ఇళ్ల నిర్మాణం కూడా చేసుకున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు అనేక రాజకీయ పార్టీలు మేము అధికారంలోకి వస్తే పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి మాట తప్పుతున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం గుడిసెలకు పట్టాలిస్తామని జీవో నెంబర్ 30 తీసుకురావడంతో పేద ప్రజల ఆశలు చిగురించాయన్నారు. రాష్ట్ర మంత్రి టిజి.భరత్ తన పుట్టినరోజు సందర్భంగా పేద ప్రజలకు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాల పంపిణీ చేయడం చాలా అభినందనీయమని అన్నారు. బాలగంగాధర్ తిలక్ నగర్‌లోని పేదలకు ఇళ్లస్థలాలను రెగ్యులరైజ్ చేస్తూ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. లేదంటే పేదలను సమీకరించి ఎమ్మార్వో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు సి.గురు శేఖర్, వై .నగేష్. నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయిబాబా, కె.సుధాకరప్ప. జె.కిరణ్మయి, ఎస్.రోశయ్య, జె.శ్రీనివాసులు, కాలనీవాసులు, శంకరమ్మ, ఎం వెంకటేశ్వర్లు( డిస్కో) మల్లికార్జున, సూరి, వెంకటేశ్వర్లు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు వస్తే ఎలా..?

**- ముందస్తు చర్యలు తీసుకోవాలి - ఎమ్మెల్యే పార్థసారధి**

**ప్రజాశక్తి - ఆదోని**

మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారధి

చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయమై భారీగా కురిస్తే పరిస్థితి ఏమిటని, ముందస్తు చర్యలు ఏమీ లేవా అంటూ ఎమ్మెల్యే పార్థసారధి అధికారులను నిలదీశారు. బుధవారం ఆదోనిలోని పాత పై ఓవర్ బ్రిడ్జిని మున్సిపల్, ఆర్అండ్‌బి, రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహం ముందు కల్వర్టు చెత్తాచెదారంతో నిండి.. నీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో మున్సిపల్ రోడ్డు జలమయమవుతుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నడుము లోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయని, శాశ్వత పరిష్కారం చూపాలని కొందరు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకోకపోతే పట్టణంలో మరింత భయంకరమైన పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు. చాలా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరాయని, వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు శ్రామికులను తయారు చేసి ఉంచాలని చెప్పారు. ఇళ్లలోకి నీరు చేరి పాడైపోయిన వారికి ప్రభుత్వం ద్వారా త్వరలో అందిస్తున్నామని, పూర్తిగా ఇల్లు పడిపోయిన వారికి హౌసింగ్ అధికారులతో మాట్లాడి నిర్మించేందుకు వారితో సమావేశం అవుతామని తెలిపారు. ఆదోని పాత ఓవర్ బ్రిడ్జి మీద అనేక రకాల మరమ్మతులు ఉన్నాయని, గుంతలు పడిపోవడం, పక్క గోడలు కుంగి ఉండడం లాంటి పరిస్థితులున్నాయని చెప్పారు. దీని స్థానంలో కొత్త బ్రిడ్జి ప్రతిపాదనకు రూ.86 కోట్లు అవసరమవుతాయని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రులతో మాట్లాడతానని తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ సత్య నారాయణ, డిఇలు రామ్మూర్తి, గోపీనాథ్ ఉన్నారు.

# పైసామే పెత్తనం..!

**- సీనియర్ అసిస్టెంట్ తీరూ అంతే..! - కార్యాలయానికి పేరు కూడా ఉండదు**
**- నూతన ఎస్ఇ, ఇఇ కార్యాలయంపై దృష్టి సారించేనా..?**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

**కాసులు కురిపించే ఆఫీసును కాదనుకుని బయటకు పోవాలని ఏ అవినీతి అధికారి అనుకుంటాడు. ఆదోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ అధికారులు కూడా ఇందుకేమాత్రం తీసిపోరు. జేబుల్లో డబ్బు నిండుతున్న ఈ ఖజానాను వదిలిపోకుండా ఏళ్ల తరబడి తిష్ట వేసుకుని కూర్చున్న వారు కొందరు. ప్రతి పనికీ ఓ ధర కట్టేసి, అన్ని పనులూ అడ్డగోలుగా చేసేసే అధికారులు ఇంకొందరు. పైసలు తీసుకున్నదే కాక, తోటి సిబ్బందిపై పెత్తనం చేసే వారు మరికొందరు. మొత్తం కలిసి ఇఇ కార్యాలయాన్ని అవినీతికి నిలయంగా మార్చేశారు.**

పిఆర్ ఇఇ కార్యాలయం

ఆదోని డివిజన్ పరిధిలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాలతోపాటు వివిధ గ్రామాల్లో రహదారుల నిర్మాణం, పంచాయతీ కార్యాలయాలకు నిధులు మంజూరు చేసేది పంచాయతీ రాజ్ శాఖ. వివిధ మండలాల నుంచి సర్పంచులు, ఎంపిటిసిలు, సివిల్ కాంట్రాక్టర్లు, వెండర్స్ పంచాయతీ రాజ్ కార్యాలయానికి తరచూ వస్తుంటారు. కార్యాలయానికి ముందు భాగంలో కార్యాలయం పేరు కూడా ఉండదని కొందరు ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఏడేళ్లగా ఓ అధికారి ఇఇ కార్యాలయంలో తిష్ట వేసి అన్నీతానై వ్యవహరిస్తున్నారు. 'కలలు కనండి నిజం చేసుకోండి' అన్న మాటలు విన్నాం. కానీ కార్యాలయంలో ఎంచక్కగా మంచ వేసి కలలు కనడం ఇప్పటివరకు ఎక్కడా చూడలేదు. ఆ అధికారికి గత ఏడేళ్లగా రెండు ప్రమోషన్లు వచ్చినప్పటికీ వదులుకొని అదే కార్యాలయం, అదే సీట్లో కూర్చోవడం ఏమిటో అర్థం కావడం లేదని వివిధ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

కార్యాలయంలో ఓ మూలకున్న మంచం

**ఉద్యోగం ఒకచోట.. జీతం మరో చోట**

ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఏడేళ్లగా తిష్ట వేసి ఇక్కడే కూర్చున్నారు. మరొకరు కర్నూల్ పిఆర్ డివిజన్‌కు బదిలీ కాగా అక్కడి నుంచి ఇక్కడికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆదోని పంచాయతీరాజ్ ఇఇ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఒకరు కర్నూలుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఒకరు టైపిస్ట్ కర్నూలుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇదే కార్యాలయంలో ఎటిఓగా విధులు నిర్వహిస్తున్న ఒకరు కర్నూలుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఒకరు డిఎల్‌పిఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. నలుగురు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్ అన్నీ తాను 'చెప్పినట్లు నడుచుకోవాలి. లేకపోతే ఫైల్ ముందుకు కదలదు' అంటూ కార్యాలయానికి వచ్చే వెండర్స్‌కు, ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు చెప్పినట్టు సమాచారం. ఉన్న అధికారులు డిప్యూటేషన్‌పై వెళ్లడం, ప్రయివేట్ వ్యక్తులతో కార్యాలయంలో పని చేయించడం ఒక తతంగంలా మారింది. ఆ కార్యాలయంలో మధ్యాహ్నమైతే నే మంచం వేసుకొని బాగా నిద్రిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై పెత్తనం చెలాయించడం పరిపాటిగా మారింది. కార్యాలయంలో ఓ చిన్నస్థాయి ఉద్యోగి తన కార్యాలయాన్ని వదిలేసి, ఎప్పుడూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో తిష్ట వేసి ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి కాంట్రాక్టర్స్, ప్రజా ప్రతినిధులు, వెండర్స్ నుంచి నుంచి వసూలు చేస్తూ మధ్యవర్తిగా రాయబారాలు నడుపుతున్నారని కాంట్రాక్టర్లు తెలిపారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఆ కార్యాలయంలో బాసుగా వ్యవహరించాల్సిన అధికారిని పక్కనపెట్టి సదరు అధికారే కార్యాలయంలో తలలో నాలుకలా వ్యవహరిస్తున్నారు. తనదైన శైలిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. వచ్చిన ప్రతి ఫైలుకు తనదైన శైలిలో బుట్టలో వేసుకుని వ్యవహారం నడుపుతుండడం గమనార్హం. ఇప్పటివరకు కర్నూలు జిల్లా పిఆర్ ఎస్ఇ విధులను నిర్వహించిన రామచంద్రారెడ్డి విరమణ పొందడంతో నూతనంగా విధులు చేపడుతున్న అధికారి ఆదోని ఇఇ కార్యాలయంపై దృష్టి సరిస్తారా అని వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

### పరిశీలించి చర్యలు తీసుకుంటాం

**- డిసి.వెంకటేష్, ఇఇ, ఆదోని**

సిబ్బంది, అధికారులు సరిపడినంత లేకపోవడంతో కొందరు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. నేను ఇఇగా వచ్చే సమయానికే వారు ఇక్కడ ఉన్నారు. మరికొందరు ప్రమోషన్లు పొంది వేరే మండలాలకు వెళ్లారు. నిబంధనలను అతిక్రమించి పనిచేసే వారిపై చర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది సక్రమంగా పనిచేయాలని ఇప్పటికే చెప్పాం.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

**- ఆర్‌టిఒ శిశిర దీప్తి**

**ప్రజాశక్తి- దేవనకొండ**

ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న ఆర్‌టిఒ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో హంద్రీ వాగులో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆదోని ఆర్‌టిఒ శిశిర దీప్తి, దేవనకొండ డిప్యూటీ తహశీల్దార్ బేగం హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా గురించి గ్రామస్తులు, రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా జెసి ఆదేశాల మేరకు బుధవారం వారు తెర్నేకల్ గ్రామాన్ని సందర్శించి హంద్రీ వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్స్‌తో వారు మాట్లాడారు. ట్రాక్టర్ ఇంజిన్‌కు, ట్రాలీకి నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిప్పితే వాహనాన్ని సీజ్ చేసి జరిమానా విధిస్తామని, రాత్రి ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, ఆర్ఐ విజయ్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, విఆర్ఒలు షఫీ, హనుమాన్, రిటైర్డ్ ఆర్‌టిసి డిపో మేనేజర్ కొండగేరి సుధాకర్, సగరం అధ్యక్షులు గడ్డం నాగరాజు, గ్రామ పెద్దలు బాపనదొడ్డి నాగభూషణం, విసి.మాదన్న, సిపిఎం నాయకులు కట్ల పరమేష్ పాల్గొన్నారు.

## ఆర్‌కె కంటి ఆస్పత్రి సేవలు హర్షణీయం

**- డీఎస్పీ భార్గవి**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మందులు అందిస్తున్న డీఎస్పీ భార్గవి

ఆర్‌కె కంటి ఆస్పత్రి నిర్వాహకులు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కుమార్ సేవలు హర్షణీయమని డీఎస్పీ ఎంఎస్.భార్గవి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా 70 ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. ముఖ్య అతిథులు డీఎస్పీ భార్గవి హాజరై మాట్లాడారు. ఆర్‌కె కంటి ఆస్పత్రి దాదాపు 20 ఏళ్లుగా సేవలందిస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద 700 ఉచిత కంటి ఆపరేషన్లు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. టౌన్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ... డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవి పాటించాలని తెలిపారు. ఆర్‌కె హాస్పిటల్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ... ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఒకటిన్నర సంవత్సరంలో 700 ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు, ఇప్పటివరకు ఎలాంటి సమస్యా రాలేదని తెలిపారు. రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ నటరాజ రెడ్డి, కార్యదర్శి సుధాకర్ రావు, డాక్టర్ గణేష్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాధ, రాజేంద్రప్రసాద్, కమలమ్మ, హాస్పిటల్ సిబ్బంది ఆనందరావు, శివ, కుమార్, లక్ష్మి, శాంతి, రఘు, ఇస్మాయిల్, హీరావతి, సౌజన్య పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందించాలి

**- అధికారులు నిర్లక్ష్యం వీడాలి : వైసిపి**

**ప్రజాశక్తి - కౌతాళం**

మండలంలోని రైతులందరికీ యూరియా అందించాలని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకం రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో పంటలు సాగు చేసి నెలన్నర అవుతున్నా ఎరువులు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు ఎరువులు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యం వీడి రాజకీయాలకు అతీతంగా రైతులకు (యూరియా) ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. మండలంలో 25 వేల హెక్టార్లలో పత్తి, మిరప, వేరుశనగ, వరి తదితర పంటలు సాగు చేశారన్నారు. ఈ పంటలకు కనీసం నాలుగున్నర టన్నుల యూరియా అవసరముండగా అధికారులు మాత్రం 45 శాతమే అందించారని తెలిపారు. వర్షాలు కురుస్తున్నాయని, పంటలకు ఎరువులు వేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. రెండు నెలలు దాటితే ఎరువులు వాడినా ప్రయోజనం ఉండదని చెప్పారు. జిల్లాలో 7 వేల హెక్టార్లు సాగయిన కోడుమూరుకు 2,500 మెట్రిక్ టన్నుల యూరియాను అందించారని తెలిపారు. మండలంలో 25 వేల హెక్టార్ల ఎకరాలు సాగయితే కేవలం 2 వేల మెట్రిక్ టన్నులు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి మండలానికి వెంటనే యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంకట్రామిరెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి తిక్కయ్య, వైసిపి నాయకులు అవతారం, బసవ ప్రభు, సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి, తోవి నర్సప్ప, అనిల్, ఆదిరెడ్డి, సిద్ధేష్, బసప్ప గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

## నేడు జాతీయ చేనేత దినోత్సవం

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి బి.కాలప్ప కోరారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఎపి చేనేత కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత అగ్రభాగాన చేనేత వృత్తి ఉందని, చేనేత వృత్తిపై లక్షలాదిమంది నేతన్నలు చాలీచాలని కూలీలతో జీవనం చేస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న వీరికి నేడు చేతినిండా పని లేక ఇతర పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం పట్ల వివక్షత చూపిస్తోందని విమర్శించారు. తగిన బడ్జెట్ కేటాయించకపోవడం, పథకాలను అమలు చేయకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయ లేదని తెలిపారు. ప్రతి కార్మికునికీ మూడు సెంట్ల స్థలమిచ్చి, ఇల్లు చేనేత వర్క్ షెడ్ ఉచితంగా నిర్మించాలని కోరారు. చేనేతలకు నేషనల్ హెల్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పాస్ పుస్తకాలు త్వరగా ఇప్పించాలని డిమాండ్ చేశారు. చేనేత నాయకులు కె.కృష్ణ, శ్రీనివాసులు, రాజు, కామర్తి లక్ష్మన్న, వెంకటేశులు, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు పాల్గొన్నారు.

## ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.92 లక్షలు

**ప్రజాశక్తి - కౌతాళం**

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ. 92,09,323 వచ్చినట్లు దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయ రాజు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... నాలుగు రోజుల నుంచి దేవాలయం ఆవరణలో హుండీ లెక్కించినట్లు తెలిపారు. భక్తులు రూ.86,80,580, చిల్లర నాణేలు రూ.5,28,743 సమర్పించినట్లు చెప్పారు. 50 సింగపూర్ డాలర్లు, దుబాయి, అమెరికా, యూరప్, ఇతర దేశాల కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. వెండి 23 కిలోల 100 గ్రాములు, బంగారం 19 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చినట్లు చెప్పారు. ఆదోని ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ లోకేశ్వరి

## ముంపు బాధితులను ఆదుకోవాలి

**- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి**

**ప్రజాశక్తి - ఆదోని**

వర్షపు భారీగా ఇళ్లల్లోకి చేరి ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంగళవారం భారీ వర్షం కురవడం వల్ల పట్టణంలోని ఆవుదూడ వంక, మండగిరి వంకలు పొంగి బోయగేరి, లేబర్ కాలనీ, రాయనగర్ ప్రశాంత్ నగర్, బొబ్బులమ్మ వీధి, బార్‌పేట, వడ్డేగేరి ప్రాంతాల్లోని నివాసాల్లోకి నీళ్లు చేరి నిత్యావసర సరుకులు తడిసిపోయాయని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ, ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు నగదు పరిహారం అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సహాయం అందేలా చూస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు నాగరాజు ఉన్నారు.

## ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టాలి : సిపిఎం

**ప్రజాశక్తి - ఆదోని**

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

చిన్నపాటి వర్షం కురిసినా మురుగు కాలువలు పొంగిపొర్లి రోడ్లన్నీ జలమయమవుతున్నాయని, శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన బోయగేరి, వడ్డేగేరి, రాయ నగర్, శంకర్ నగర్ ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. బాధితులకు సహాయం అందేలా ఎమ్మెల్యే అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. నష్టపోయిన బాధితులను గుర్తించి సరుకులు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# ఆటో కార్మికులను ఆదుకోవాలి

**- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు ప్రభాకర్**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశానికి ఆయన హాజరయి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు ఆటో కార్మికులకు ఎలాంటి ఆర్థిక సహాయమూ అందజేయలేదని అన్నారు. మరోపక్క ఆటో కార్మికులకు ఇఎంఐ చెల్లింపుల వేధింపులు, పోలీసు చలానా ఇబ్బందులు ఎక్కువయ్యాయని తెలిపారు. అలాగే ఈనెల 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను కూడా ఆదుకునేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

**సిఐటియు నాయకుల సన్మానం**

ఇటీవల కేరళ తిరువనంతపురంలో జరిగిన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ 12వ జాతీయ సమావేశాల్లో కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ప్రభాకర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. సిఐటియు నాయకులు కరుణాకర్, నబి రసూల్, ఆటో వర్కర్స్ నాయకులు వేణుగోపాల్, నాగేష్, కృష్ణ, ఆది, ధనుంజయ, జాఫర్, తిమ్మారెడ్డి, బాబు, ఫరీద్ పాల్గొన్నారు.

ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

# ప్రజలను మోసం చేస్తున్న 'కూటమి' : వైసిపి

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, వైసిపి 21వ వార్డు ఇన్‌ఛార్జీ, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ చాంద్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని 21వ వార్డు హెచ్‌పిఎస్ కాలనీ, గీతా మందిర్ ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన 100కు పైగా హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. నేడు 'సుపరిపాలనలో తొలి అడుగు' అంటూ మరో మోసం ప్రారంభించిందని మండిపడ్డారు. ఇది తొలి అడుగు కాదు.. చంద్రబాబు రాజకీయ జీవితానికి చివరి అడుగని ప్రజలు అంటున్నారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్ అహ్మద్, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివ, జిల్లా అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు నరసింహులు, జిల్లా మైనారిటీ విభాగం ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, జిల్లా మేధావుల ఫోరం కార్యదర్శి బాబాఖాన్, మైనారిటీ నాయకులు ఖాసీంబేగ్, ఐటి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాచాని సోమేష్, పట్టణ యూత్ అధ్యక్షులు బోయ రాజు, పట్టణ మైనారిటీ అధ్యక్షులు ముల్లా రసూల్, రైతు విభాగం పట్టణ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పట్టణ మహిళ అధ్యక్షులు లతా రెడ్డి, డాక్టర్స్ విభాగం పట్టణ అధ్యక్షులు యుసూఫ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, పట్టణ కార్యదర్శులు గుర్వ మాబాషా, 15వ వార్డ్ ఇన్‌ఛార్జీ ఫయాజ్, మాచాని రఘు, టికె.గౌస్, ఉస్మాన్, 29వ వార్డు ఇన్‌ఛార్జీ పామయ్య, నరసింహులు, మంజునాథ్, 5వ వార్డ్ ఇబ్రహీం, సోషల్ మీడియా సభ్యులు షరీఫ్, రవికుమార్, 21వ వార్డ్ నాయకులు గొల్ల రాజేష్, పాండు, హనుమంతు పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని హాల్వి, వల్లూరు, చూడి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకం రెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, చెన్నప్ప, బసవ ప్రభు, తోవి నర్సప్ప, మరి గౌడ్, రమేష్, నాగరాజు, ఉప్పలప్ప, వెంకట్రామి రెడ్డి, సుధాకర్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, సోమిరెడ్డి, పాల్ దినకరన్, అబ్దుల్ సమద్, అవతారం, రాముడు, అనిల్, హుస్సేని, శరణ, సిద్ధేష్, నీలకంఠ రెడ్డి, బసప్ప గౌడ్, ధర్మన్న పాల్గొన్నారు. **మంత్రాలయం :** కోసిగి మండలంలోని ఆర్లబండ గ్రామంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' నిర్వహించారు. వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, నాయకులు మండల కన్వీనర్ బెట్టనగౌడ్, నాడిగేని నాగరాజు, కాంట్రాక్టర్ నాగరాజు, గాణిగి వీరస్వామి, నరసింహులు, పరశురాం, తాయమ్మ, హనుమప్ప, గాదిరెడ్డి, యంకన్న, ఖాసీం, భాను ప్రకాష్, బసవరాజు, ఆనంద్, షేక్షావలీ, హనుమంతు రెడ్డి, వీరేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కౌతాళంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కోసిగిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

### రామలింగేశ్వర ఆలయ

# చైర్మన్ పీఠమెవరిది..?

**- వ్యాపార వేత్తదా..? పార్టీ కోసం కష్టపడిన వారిదా..?**

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం మండలం గురజాల గ్రామంలో వెలిసిన రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందా అని మండల ప్రజల్లో ఆసక్తి నెలకొంది. గత 15 రోజులుగా సోషల్ మీడియాలో ఒక వ్యాపారవేత్త పేరు చైర్మన్‌కు ఎంపిక చేస్తున్నట్లు వార్త చక్కర్లు కొడుతోంది. ఆ వ్యక్తి గురజాల గ్రామానికి చెందిన వ్యక్తి కాదు. వేరే గ్రామానికి చెందిన వ్యాపార వేత్త. ఆయన పేరు బయటకు రావడం మండల రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. గురజాల గ్రామస్తులు ఆ వార్తను జీర్ణించుకోలేకపోతున్నారని సమాచారం. టిడిపి నాయకులు ఆ వార్త అవాస్తవమని, ఎమ్మెల్యే మాకు న్యాయం చేస్తారని మాట్లాడుకుంటున్నారు.

సోషల్ మీడియాలో వచ్చిన ఆ వ్యాపారవేత్త గత వైసిపి ప్రభుత్వంలో మండల రాజకీయాల్లో ఎక్కడా కనిపించలేదని గురజాల గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గత నెల రోజులుగా ఆయన తెరపైకొచ్చారని, దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశామని నాయకులు, కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు. రామలింగేశ్వర ఆలయ కార్యక్రమాలను, కట్టుబాట్లను కొనసాగిస్తూ ఆలయ ప్రతిష్టను కాపాడుతున్నామని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఏ కార్యక్రమం ప్రారంభించినా మొదట రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రామలింగేశ్వర దేవాలయంపై ఆయనకు భక్తి ఎక్కువ అని టిడిపి నాయకులు చెబుతున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పుడు దైవదర్శనానికి బీవీ రాగా కొంతమంది వ్యక్తులు అడ్డుకున్నారు. అప్పుడు తాము ముందుండి తమ నాయకునికి దేవుని దర్శనం చేయించామని కొంతమంది నాయకులు మాట్లాడుకుంటున్నట్లు తెలిసింది. అలాంటి క్లిష్ట సమయంలో పార్టీ గౌరవం కోసం తాము తమ ఎమ్మెల్యే ముందుండి సమస్యను ఎదుర్కొన్నామని కొంతమంది దగ్గర బాధను చెప్పుకుంటున్నట్లు సమాచారం. గ్రామంలో వెలిసిన దేవునిపై భక్తి లాగే తమ గ్రామంలో ఉన్న టిడిపి నాయకులపైనా ఆయనకు అభిమానం ఎక్కువ అని, కచ్చితంగా ఆయన నిర్ణయం తమ వైపే ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. గురజాల జాతర సమయంలో ఎమ్మెల్యే బీవీ గ్రామాన్ని సందర్శించినప్పుడు చైర్మన్ పదవిని గురజాల గ్రామానికి చెందిన రాజేష్ రెడ్డి, శివారెడ్డి ఇద్దరికీ కేటాయిస్తామని హామీ ఇచ్చారని, రెండున్నరేళ్లు ఒకరు, తర్వాత మరొకరు చైర్మన్‌గా కొనసాగేలా హామీ ఇచ్చారని సమాచారం. గురజాల గ్రామానికి చెందిన బీసీలు కొంతమంది చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నట్లు తెలిసింది. గురజాల గ్రామస్తులతో కలిసి టిడిపి నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన దగ్గర చర్చించుకుంటామని మాట్లాడుకున్నట్లు సమాచారం. పార్టీ కోసి పని చేసిన నాయకులకు కేటాయిస్తారా, సోషల్ మీడియాలో హల్చల్ అవుతున్న పారిశ్రామిక వేత్తకు దేవాలయ బాధ్యతలు కట్టబెడతారా అన్నది వేచి చూడాల్సి ఉంది. సోషల్ మీడియాలో వస్తున్న వ్యక్తికి కేటాయిస్తే ఆ నిర్ణయాన్ని టిడిపి శ్రేణులే కాకుండా గ్రామస్తులు కూడా విమర్శించే అవకాశాలున్నట్లు సమాచారం.

రామలింగేశ్వర ఆలయం

## అడ్డదిడ్డంగా ఎన్‌టిపిసి సోలార్ కంపెనీ రిజిస్ట్రేషన్లు : రైతులు

**ప్రజాశక్తి- ఆలూరు**

మాట్లాడుతున్న రైతులు

ఆలూరు, చిప్పగిరి మండలాల్లో సోలార్ కంపెనీలు అడ్డదిడ్డంగా రైతుల భూములను రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయని మొలగవల్లికి చెందిన రైతులు నాగప్ప, నరసింహులు, లక్ష్మీదేవి, ఈరన్న వాపోయారు. హత్తి బెళగల్ రెవెన్యూ పరిధిలో సాగులో ఉన్న తమ భూముల సర్వే నెంబర్లపై ఎన్‌టిపిసి సోలార్ కంపెనీ ఇతర వ్యక్తుల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకుందని, దీనివల్ల తమ పొలాలు ఆన్‌లైన్‌లో లేకుండా ఉన్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం తహశీల్దార్ శోభ సువర్ణకు విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. హత్తి బెళగల్ సర్వే నెంబర్ 45ఎ, 46ఎలో 23.62 ఎకరాలను 18 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్‌తో సహా తాము సాగులో ఉండగా వేరొక వ్యక్తితో కొన్నట్లు ఎన్‌టిపిసి సోలార్ కంపెనీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని చెప్పారు. ఎటువంటి సర్వే రిపోర్ట్ లేకుండా ఆన్‌లైన్‌లో భూమి ఉంటే రిజిస్ట్రేషన్‌కు వెళ్తున్నారని, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో చాలా భూములు తప్పుల తడకగా నమోదయ్యాయని తెలిపారు. తాము సాగులో ఉన్న భూములను సర్వే చేయించకుండా అడ్డదిడ్డంగా కొనుగోలు చేస్తున్న సోలార్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రీమఠంలో మాజీ డిప్యూటీ సిఎం ఈశ్వరప్ప

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని కర్ణాటక మాజీ డిప్యూటీ సిఎం ఈశ్వరప్ప కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజ్ ఆచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు మెమెంటో, విఐపి శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించారు. కనకవీడు గిరి, శ్రీమఠం ద్వారపాలకులు అనంత స్వామి, ప్రకాష్ స్వామి, పవన్ స్వామి, కురిడి జయతీర్థ స్వామి పాల్గొన్నారు.

## రైతులకు యూరియా అందించాలి

**- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి**

**ప్రజాశక్తి - హొళగుంద**

రైతులకు సరిపడ యూరియా అందించాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి కోరారు. బుధవారం కర్నూలు వ్యవసాయ అధికారి కార్యాలయంలో జెడిఎ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని రైతులకు యూరియా అందక ఇబ్బంది పడుతున్నారని, గ్రామంలో ఒక లారీ వస్తుందని, అది కొంతమంది మాత్రమే సరిపోతుందని తెలిపారు. మిగతా రైతులు యూరియా అందక రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నారని, బయట కొనాలంటే అధిక ధరలకు విక్రయఇస్తున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌కె దగ్గర యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడి రోజూ వెనుదిరిగిపోతున్నారని తెలిపారు. రైతులు సరిపడ యూరియా అందించాలని కోరారు. జెడిఎ వరలక్ష్మి మాట్లాడుతూ... వెంటనే యూరియా పంపిస్తామని తెలిపారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతం

**- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

చిప్పగిరిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, బిడ్డకు పాలు ఇవ్వడం తల్లికి కూడా ఆరోగ్యకరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ, హెల్త్ సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం చిప్పగిరిలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిపాల విశిష్టత, తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఎఎన్ఎం శాంతి కుమారి, అంగన్వాడీ టీచర్లు హరిత, రామ తులసి, పద్మ, పుల్లమ్మ, ఆశా కార్యకర్తలు కవిత, జములమ్మ, మస్తానమ్మ పాల్గొన్నారు. **నందవరం** మండలం హాలహర్వి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ఆవరణలో ఎమ్మిగనూరు సిడిపిఒ సఫరున్నీసా బేగం ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.మహాదేవి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి వారోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడీలు లక్ష్మీదేవి, జయంతి, వనజ బాయి, లలిత పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సెక్టార్ 2లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిసి సూపర్‌వైజర్లు పద్మ, సునీత, హెల్త్ సూపర్‌వైజర్ వసంత కుమారి, ఎఎన్ఎంలు వసుంధర, రుద్ర, అంగన్వాడీ కార్యకర్తలు రసుల బేగం, లతా, విశ్వకుమారి, రాధ, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, మహేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రిలో ఐఎంఎ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లాక్టేషన్ కన్సల్టెంట్ డాక్టర్ రఘునాథ్, ఐఎపి జిల్లా సెక్రటరీ డాక్టర్ రత్నాకర్ రెడ్డి, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ మాధవి లత, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సైఫుల్లా, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డిలు మాట్లాడారు. అంతకుముందు తల్లులు పిల్లలకు ఎలా పాలు పట్టించాలి, శిశువును ఎలా ఎత్తుకోవాలన్న విషయాలపై వీడియోల ద్వారా తెలియజేశారు. అనంతరం మాతా శిశు ఆస్పత్రిలో గర్భిణులకు పండ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఐఎంఎ ఆదోని అధ్యక్షులు కృష్ణమూర్తి, ఇన్నర్ వీల్ అధ్యక్షులు తన్వి, కార్యదర్శి సౌమ్యా, డాక్టర్లు మల్లికార్జున రెడ్డి, కిరణ్ కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు భరత్ షా, కౌశిక్, వికాస్, సాబీర్, రాజేష్, హుస్సేన్, శివరాం పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని ప్రభుత్వాస్పత్రి సమావేశ భవనంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గోనెగండ్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంగ రవళి, ఎమ్మిగనూరు సిడిపిఒ సఫరున్నీసా బేగం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, రాధ పాల్గొన్నారు.

ఆస్పరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు